

ఫ్లాగ్ మార్చ్‌లో ఏసీపీ రమేష్‌కుమార్, సీఐలు నిరంజన్, సీతయ్య తదితరులు

ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోండి : ఏసీపీ

రాంనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని చిక్కడపల్లి సబ్ డివిజన్ ఏసీపీ టి. రమేష్‌కుమార్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలింగ్ స్టేషన్ల వద్ద భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ముషీరాబాద్, దయారా మార్కెట్, పఠాన్‌బస్తీ, జమిస్తాన్‌పూర్, ఫిష్‌మార్కెట్, రాంనగర్ చౌరస్తా, ఈసేవ వరకు పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముషీరాబాద్, చిక్కడపల్లి సీఐలు నిరంజన్, సీతయ్య, ఎస్ఐ, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం.. ఎస్ఐ సస్పెన్షన్

అంబర్‌పేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు ఓ ఎస్ఐని నగర పోలీసు కమిషనర్ సస్పెండ్ చేశారు. ప్రస్తుతం మొగుల్‌పురా పీఎస్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న అశోక్‌కుమార్ గతంలో అంబర్‌పేట ఎస్ఐగా పని చేశారు. బదిలీకి ముందు నైట్ డ్యూటీలో ఉన్నప్పుడు సంజీవచారి అనే వ్యక్తి తన ఫోన్ ఎవరో దొంగిలించారని అర్ధరాత్రి సమయంలో పీఎస్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఆ సమయంలో సంజీవచారి మద్యం తాగి ఉండడంతో ఉదయం రమ్మని ఎస్ఐ అతడిని పంపించేశారు. ఎస్ఐ ఫిర్యాదు తీసుకోలేదని ఈస్ట్‌జోన్ డీసీపీ, నగర సీపీకి సంజీవచారి ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన సీపీ ఎస్ఐ ఫిర్యాదు తీసుకోలేదని తేలడంతో అశోక్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి'

కవాడిగూడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్‌కు బీసీ విద్యార్థి విభాగం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్ బుధవారం వినతిపత్రం అందజేశారు. విక్రమ్‌గౌడ్ మాట్లాడుతూ, నకిలీ పత్రాలతో ప్రైవేట్ ఆస్పత్రులు అనుమతి తీసుకుంటున్నాయని, ఫైర్‌సేఫ్టీ, పార్కింగ్ తదితర సదుపాయాలు లేకుండా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేయించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు నరసింహ నాయక్, రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగయ్య, యువజన సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈడిగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి ఆర్థిక సహాయం

బర్కత్‌పుర, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి (ఏసీపీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రేమ్ గాంధీ ఆర్థిక సహాయం అందజేశారు. మెదక్ జిల్లాకు చెందిన రాములు, స్వాతి దంపతులు నగరంలో ఇసామియా బజార్‌లో నివసిస్తున్నారు. రాములు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరి కుమార్తె హరిణి(10) బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో రెయిన్‌బో ఆస్పత్రిలో చేర్పించారు. ఆపరేషన్‌కు లక్షలాది రూపాయలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో రాములు ప్రేమ్ గాంధీని సంప్రదించగా విరాళాలు సేకరించి రూ. 1,84,100 చెక్కు అందజేశారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి అండగా నిలవండి


లబ్ధిదారులను కలిసి బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు బీజేపీకి అండగా నిలవాలని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ కోరారు. బుధవారం కవాడిగూడ డివిజన్ ఉన్నికోట, తాళ్లబస్తీ, చిత్రాలనగర్ బస్తీల్లో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న వారిని కలిసి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి. ఇందిర, బీజేపీ నాయకులు రంగరాజ్‌గౌడ్, జి. వెంకటేష్, రాగం రవికుమార్, మద్దెల చంద్రయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లిలో బీజేపీకి మెజారిటీ ఓట్లు వచ్చేందుకు కృషి చేయండి

బర్కత్‌పుర, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో నాంపల్లి నియోజకవర్గం నుంచి బీజేపీకి మెజారిటీ ఓట్లు వచ్చేందుకు నాయకులు కృషిచేయాలి ఆ పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు కోరారు. బుధవారం బర్కత్‌పురలో పార్టీ నగర కార్యాలయంలో నిర్వహించిన నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో లబ్ధిపొందుతున్న వారిని కలవాలని సూచించారు. సమావేశంలో బీజేపీ నేతలు భరత్, యాదగిరిరెడ్డి, పవన్‌కుమార్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం ఎంపీ టికెట్ యాదగిరికి కేటాయించాలి


- కాంగ్రెస్ అధిష్ఠానానికి పలు ప్రజాసంఘాల వినతి

నల్లకుంట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం ఎంపీ టికెట్‌ను దోబీ రిజర్వేషన్ సంఘ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఉల్లెంగల యాదగిరికి ఇవ్వాలని పలు ప్రజా సంఘాల నాయకులు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదర్‌గూడలో ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు ప్రొఫెసర్ గాలి.వినోద్‌కుమార్, పాలూరి రామకృష్ణ, ప్రభంజన్‌యాదవ్, డాక్టర్ మనోహర్, బొలిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడారు.

ఆధ్యాత్మిక వేడుకలకు హిందూ జ్ఞాన వేదిక సభ్యులు

బర్కత్‌పుర, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఏపీలో అనంతపురం జిల్లా తాడిపత్రిలో శ్రీకృష్ణమందిరంలో ఈ నెల 5న నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక వేడుకలకు కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి 2 వేల మంది హిందూ జ్ఞాన వేదిక సభ్యులు బుధవారం బయలుదేరి వెళ్లారు. హిందూ జ్ఞాన ప్రదాత శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు హిందూ జ్ఞాన వేదిక నగర అధ్యక్షుడు గిరి తెలిపారు.

వీహెచ్‌పీ చిక్కడపల్లినగర్ అధ్యక్షుడిగా సంజయ్‌కుమార్ అగర్వాల్


సంజయ్‌కుమార్‌కు కండువా కప్పుతున్న అజయ్‌రాజ్

కవాడిగూడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) చిక్కడపల్లి నగర్ అధ్యక్షుడిగా దోమలగూడకు చెందిన సంజయ్ కుమార్ అగర్వాల్ నియమితులయ్యారు. ఆయన నియామాన్ని విశ్వహిందూ పరిషత్ విద్యానగర్ జిల్లా కార్యదర్శి అజయ్‌రాజ్, బజరంగ్‌దళ్ విద్యానగర్ జిల్లా సంయోజక్ అధ్యక్షుడు అభిషేక్ బుధవారం ప్రకటించారు. సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. వీహెచ్‌పీతోపాటు బజరంగ్‌దళ్ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

బాలుడి అదృశ్యం


తిలక్‌రాజ్

చిక్కడపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఓ బాలుడు కనిపించకుండా పోయాడు. రాణీగంజ్ గాస్‌మండిలో నివసిస్తున్న శివానంద్ మొదటి భార్య సమత 2021లో చనిపోయింది. కుమారుడు తిలక్‌రాజ్(9)ను హాస్టల్‌లో చేర్పించాలని భావించాడు. ఈ క్రమంలో పదిహేను రోజుల నుంచి చిక్కడపల్లి వెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంతంలో నివసించే శివానంద్ మొదటి భార్య స్నేహితురాలైన తులసి ఇంట్లో తిలక్‌రాజ్ ఉంటున్నాడు. 2వ తేదీన హాస్టల్‌లో చేర్పించడానికి అడ్మిషన్ తీసుకున్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటల నుంచి తిలక్‌రాజ్ కనిపించడం లేదు. బాలుడి ఆచూకీ లభించకపోవడంతో శివానంద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కాంగ్రెస్‌కు 40 ఎంపీ సీట్లు రావడం కష్టమే

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అరుణ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు

ముషీరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు 40 ఎంపీ సీట్లు కూడా రావడం కష్టమేనని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్‌లో అరుణ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రాంతంలో కార్పొరేటర్ సుప్రియ నవీన్ ఆధ్వర్యంలో స్థానికులతో కలిసి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజలు అభివృద్ధి, సంక్షేమం కోరుకుంటున్నారని, అది ప్రధాని నరేంద్రమోదీతోనే సాధ్యమని అన్నారు. కాంగ్రెస్‌కు దేశంలో ఆదరణ కరువైందన్నారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికలు దేశ భవిష్యత్‌కు సంబంధించినవని అన్నారు. 70 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ఒక్క జమ్మూ కాశ్మీర్‌లోనే 46 వేల మంది ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయారని అన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేయడంతో జమ్మూ కాశ్మీర్ లాల్‌చౌక్‌లో స్వేచ్ఛగా జాతీయ జెండా ఆవిష్కరిస్తున్నారని తెలిపారు. ఉగ్రవాదుల చర్యలు అరికట్టడంతో దేశ, విదేశాలకు చెందిన 400కు పైగా సినిమా షూటింగ్‌లు జమ్మూ కాశ్మీర్‌లో కొనసాగుతున్నాయని, ఇదంతా ప్రధాని మోదీకే సాధ్యమైందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను శంషాబాద్ విమానాశ్రయం వలే అభివృద్ధి చేసేందుకు ప్రధాని మోదీ రూ. 720 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియగించుకునేలా ప్రజా సంఘాలు సామాజిక బాధ్యతగా పని చేయాలని కోరారు.

కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ రమేష్ రామ్, జాయింట్ కన్వీనర్ ఎం. నవీన్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర సభ్యుడు నందు, రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పాపానారాయణ, కంచి కుమార్, అరుణ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు డేనియల్, ఆనంద్, ఉపాధ్యక్షుడు వేణు, విశ్రాంత డీసీపీ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

రాంనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్ కోసం మరోసారి మోదీని ప్రధానమంత్రి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం అడిక్‌మెట్ డివిజన్ పద్మాకాలనీలో జరిగిన ఎన్నికల ప్రచార సమావేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరూ పోలింగ్‌లో పాల్గొని ఓటింగ్ శాతాన్ని పెంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సూచించారు. సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి రెండోసారి తనను గెలిపించాలని కోరారు. సమావేశంలో పద్మాకాలనీ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాచర్ల రంగయ్య, జాయింట్ సెక్రటరీ రాకేష్, కార్యదర్శి నర్సింగ్‌రావు, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి పూస రాజు, రాష్ట్రఅధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు ఆర్. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జెమినీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కూడా కిషన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పూస ఐలేశ్వర్, సోమశేఖర్, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు కలకోట అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో అతిపెద్ద కుంభకోణం ఎలక్టోరల్ బాండ్స్


మాట్లాడుతున్న దిడ్డి సుధాకర్

కవాడిగూడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు భారత దేశంలో జరిగిన కుంభకోణాల్లో అతిపెద్దది 'ఎలక్టోరల్ బాండ్స్' అని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. కార్పొరేట్ కంపెనీలపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలను ప్రయోగించి బీజేపీ వేలకోట్ల రూపాయల దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు. బుధవారం దోమలగూడలో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రశ్నించినందుకే ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌పై అక్రమ కేసు బనాయించి అరెస్ట్ చేశారని ఆరోపించారు. ప్రశ్నించే గొంతుకలను అరెస్ట్ చేసి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలవాలని ప్రయత్నిస్తోందన్నారు.

ఈడీ, సీబీఐ, ఐటీ విభాగాలతో బీజేపీ కార్పొరేట్ కంపెనీలపై దాడులు చేయించి భయభ్రాంతులకు గురిచేసిందని, కొంతమంది కార్పొరేట్ కంపెనీల యజమానులపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయించిందన్నారు. ఈ ఇబ్బందుల నుంచి తప్పించుకోవడానికి చాలా కంపెనీలు ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసి వేల కోట్ల రూపాయలు బీజేపీకి కట్టబెట్టాయన్నారు. బీజేపీకి కార్పొరేట్ కంపెనీలు రూ. 2,592 కోట్లు విరాళంగా ఇచ్చాయనీ, వీటిలో 1853 కోట్లు దాడుల తర్వాత ఇచ్చినవని పేర్కొన్నారు. బాండ్లు ఇచ్చిన కంపెనీ యజమానులకు బెయిల్ మంజూరు చేశారని ఆరోపించారు. బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ కోర్ కమిటీ సభుడు బుర్రా రాముగౌడ్, మహిళా విభాగం అధక్షురాలు హేమ, అధికార ప్రతినిధి జావిద్ షరీఫ్, దివ్యాంగ విభాగం కన్వీనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆలోచనలకు శ్రీకారం ఉగాది


చిదంబరశాస్త్రిని సన్మానిస్తున్న రమణాచారి

చిక్కడపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలుగువారు ఉగాదిని నూతన ఆలోచనలకు శ్రీకారంగా భావిస్తారని ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ రమణాచారి అన్నారు. చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం రాత్రిత్యాగరాయ గానసభలో జరిగాయి.

అధ్యక్షత వహించిన ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ.. చిమ్మపూడి శ్రీరామమూర్తి ఇంటిపేరిట సంస్థను ఏర్పాటు చేసి సంగీత సాహిత్యాల ఉద్దీపనకు వేదిక కల్పిస్తున్నారన్నారు. అయోధ్యరామాలయంలో రాముని విగ్రహం కింద యంత్రం రూపొందించిన ప్రవచనకర్త అన్నదానం చిదంబరశాస్త్రిని ఆధ్యాత్మిక కేసరి బిరుదుతో, గాయకుడు రామాచారిని సుస్వర రామబిరుదుతో సత్కరించారు. ఆకృతిసుధాకర్, సాధన నరసింహాచార్య, చిక్కా రామదాసు, పోరెడ్డి రంగయ్యకు పురస్కారాలు బహూకరించారు. దూరదర్శన్, ఆకాశవాణి సంచాలకులు కామేశ్వరి, ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

తుక్కుగూడ సభను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న అంజన్‌కుమార్ యాదవ్

రాంనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 6వ తేదీన తుక్కుగూడలో జరిగే శంఖారావ బహిరంగ సభను జయప్రదం చేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం న్యూఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ముషీరాబాద్ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సైనికుల్లాగా పనిచేయాలని సూచించారు. ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి వేలాదిమంది సభకు హాజరయ్యేలా జనసమీకరణ చేయాలని కోరారు. ఆ రోజు మధ్యాహ్నం 12 గంటలకు ఎన్టీఆర్ స్టేడియం నుంచి నాయకులు, కార్యకర్తలు సభకు ర్యాలీగా వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో రాజీవ్‌గాంధీ సంఘటన పంచాయతీరాజ్ మంచ్ మాజీ చైర్మన్ గుర్రం శంకర్, మాజీ కార్పొరేటర్లు ఆర్.కల్పనాయాదవ్, రావి వెంకటరెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు అంజియాదవ్, డివిజన్ల అధ్యక్షులు అభిషేక్ కెనెడి, తిరుమల్, పెండెం శ్రీనివాస్, పోతరాజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తున్నందుకే నాపై సస్పెన్షన్ వేటు

- కాంగ్రెస్ బహిష్కృత నాయకుడు బక్క జడ్సన్



మాట్లాడుతున్న బక్క జడ్సన్

పంజాగుట్ట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పదేళ్లపాటు జరిగిన దోపిడీపై నిరంతరం ఉద్యమించా. కాంగ్రెస్ ఐడియాలజీని పాటిస్తూ.. పూర్తిగా పార్టీ ఆర్గనైజేషన్‌కు అంకితమయ్యా. ప్రశ్నిస్తున్నందుకే నాపై సస్పెన్షన్ వేటు వేశారు' అని కాంగ్రెస్ పార్టీ బహిష్కృత నాయకుడు బక్క జడ్సన్ ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లకు లాభం చేయడానికే రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని, బీజేపీ అత్యధిక సీట్లు గెలవాలని ఆయన కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కేసీఆర్ రైతులకు రైతుబంధు పథకం కింద ఇవ్వాలని పెట్టిన రూ.7వేల కోట్లను ప్రస్తుత సీఎం ఏమి చేశారని, ఇప్పటి వరకు కాంగ్రెస్ బ్యానర్ కింద చేసిన ఉద్యమాలను కొనసాగించడానికే తెలంగాణ వనరుల రక్షణ సమితిని ఏర్పాటు చేసినట్లు ఆయన ప్రకటించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సస్పెన్షన్, భవిష్యత్ కార్యక్రమాలపై ఆయన మాట్లాడారు. వివరణ ఇవ్వాలని క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి నోటీసు ఇచ్చారని, ఫిర్యాదులు ఏమిటో చెప్పాలని అడిగినా.. అప్పటికే తీసుకున్న నిర్ణయం ప్రకారం తనను సస్పెండ్ చేశారన్నారు. వివిధ శాఖల్లో నిధుల దుర్వినియోగంపైన ఈడీ, సీబీఐకి, కొందరి రాజకీయ నేతల అవినీతిపై పై చేసిన ఫిర్యాదుల గురించి వివరించారు. ప్రాణభయం, రాజకీయ భవిష్యత్‌పై ఆశ వదిలేసి కల్వకుంట్ల కుటుంబంపై పోరాటం చేశానన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే ఓటు వేస్తా, వేయిస్తా అని అన్నారు. నేను ఎవరి చేతుల్లో ఆయుధం కాదన్నారు. అన్నింటిపై ప్రశ్నిస్తున్నందుకే సస్పెండ్ చేశారని, అయినా పార్టీమారే పరిస్థితి లేదన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ రవీందర్‌రావు హఠాన్మరణం


రవీందర్‌రావు(ఫైల్)

అంబర్‌పేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో సీనియర్ జర్నలిస్ట్ బుధవారం మృతి చెందారు. భైరిశెట్టి రవీందర్‌రావు(55) సీనియర్ జర్నలిస్ట్. అంబర్‌పేట బాపూనగర్‌లో నివసిస్తున్నారు. బుధవారం ఉదయం ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రవీందర్‌రావు మృతి పట్ల పలు జర్నలిస్టు సంఘాల నేతలు సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, పలువురు సీనియర్ జర్నలిస్టులు రవీందర్‌రావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రవీందర్‌రావు భౌతికకాయానికి కాచిగూడ హర్రాజీపెంట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

అపార్ట్‌మెంట్‌లో చోరీ

- ఏడున్నర తులాల బంగారు నగలు, కిలో వెండి వస్తువుల అపహరణ

కవాడిగూడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఓ అపార్ట్‌మెంట్‌లో చోరీ జరిగింది. ఏడున్నర తులాల బంగారు నగలు, కిలో వెండి వస్తువులను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. సీఐ డి. రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నెక్లెస్ మాల్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న రమ్య ఇంట్లో భద్రపరిచిన నగలు, వెండి వస్తువులు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన కల్పించాలి


జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అభిలాష బిస్త్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వినియోగిస్తున్న వారిలో యువత ఎక్కువగా ఉన్నారని, వారికి డ్రగ్స్ అలవాటు కాకుండా ఉండేందుకు అవగాహన కార్యక్రమాలతో పాటు చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీజీ అభిలాష బిస్త్ అన్నారు. అంబర్‌పేట పోలీస్ శిక్షణ కళాశాలలో డ్రగ్స్ రహిత సమాజం అనే అంశంపై బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా శిక్షణ అభ్యర్థులతో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ప్రతిజ్ఞ చేయించారు. శిక్షణ పొందిన పోలీసులు సర్వీసులో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా ఉండేందుకు వారికి అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ పరవస్తు మధుకర్ స్వామి కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీల విజేతలకు ప్రశంశా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డీఎస్పీ పిచ్చయ్య, డీఎస్పీలు ఉమామహేశ్వరరావు, లక్ష్మణ్, మదన్‌మోహన్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భారతీయ ఆధ్యాత్మికతకు విశిష్ట స్థానం

- ఉత్తరాది మఠం పీఠాధిపతి సత్యాత్మతీర్థ స్వామీజీ

బర్కత్‌పుర, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భారతీయ ఆధ్యాత్మికతకు విశిష్ట స్థానం ఉందని ఉత్తరాది మఠం పీఠాధిపతి సత్యాత్మతీర్థస్వామి అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచాయన్నారు. బుధవారం కాచిగూడ ఉత్తరాదిమఠం వద్ద వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలని, ప్రపంచమంతా నేడు భారత్ వైపు చూస్తుందన్నారు. ఆధ్యాత్మికత పెంపొందినప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు కె.గీతామూర్తి, మఠం అధికారి జయతీర్థాచార్యులు, అమితాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో పథకాలలో అవకతవకలపై విచారణ జరిపించండి : అరవింద్‌కుమార్

రాంనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో దళిత బంధు, బీసీ బంధు, మైనారిటీ బంధు, 'డబుల్' ళ్ల మంజూరులో అవకతవకలపై విచారణ జరిపించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం. అరవింద్‌కుమార్ యాదవ్ ఫిర్యాదు చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ 30 శాతం కమీషన్ తీసుకొని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, బంధువులు, తన వద్ద పనిచేసే సిబ్బందికి పథకాలు ఇప్పించారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. బోగస్ సర్టిఫికెట్లు పెట్టి దళిత బంధు తీసుకున్నారని, ఓ డివిజన్ అధ్యక్షుడు కుటుంబంలో ఓ ఇంట్లో ముగ్గురికి దళిత బంధు ఇచ్చారని, విచారణ జరిపించాలని కోరారు.

'షహీద్ దివస్‌ను గౌరవించుకోవాలి'

రాంనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగానికి గుర్తింపుగా నిర్వహించే షహీద్ దివస్‌ను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని అంబేద్కర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో కళాశాల ఎంబీఏ సెమినార్ హాల్‌లో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో షహీద్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. మహనీయులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా మినిస్ట్రీస్ ఆఫ్ యూత్ ఎఫైర్స్, స్పోర్ట్స్ రీజనల్ డైరెక్టర్ ఆఫ్ ఎన్ఎస్ఎస్ షహీద్ దివస్ ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.


మాదిగలకు ఎంపీ సీటు ఇవ్వకుండా కాంగ్రెస్ మోసం


మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఒక్క ఎంపీ సీటు కూడా మాదిగలకు ఇవ్వకుండా కాంగ్రెస్ మోసం చేసిందని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం విద్యానగర్‌లో ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలకు ఎంపీ సీట్ల కేటాయింపులో కాంగ్రెస్ చేసిన మోసాన్ని ఎండగడుతూ పార్టీ అభ్యర్థులు, మంత్రులను అడ్డుకుని చావుడప్పు కొడుతూ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కడియం శ్రీహరి మాదిగలను మోసం చేశారని, ఆయనను కాంగ్రెస్‌లో ఎలా చేర్చుకున్నారని, ఏనాడూ తెలంగాణ, మాదిగ దండోరా ఉద్యమంలో పాల్గొనని కడియం కావ్యకు వరంగల్ ఎంపీ సీటు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఆంధ్రకు చెందిన వ్యక్తిని వివాహం చేసుకున్న కావ్యకు తెలంగాణతో సంబంధం లేదన్నారు. కడియం శ్రీహరి తన కుమార్తెను పోటీ నుంచి తప్పించకపోతే ఆయన ఇంటి ఎదుట చావు డప్పు మోగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

'మాదిగలను ఓటు అడిగే హక్కు కాంగ్రెస్‌కు లేదు'

ముషీరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎంపీ టికెట్ల కేటాయింపులో మాదిగలకు కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నవీన్‌రాజ్ విమర్శించాడు. మాదిగలను ఓటు అడిగే హక్కు కాంగ్రెస్‌కు లేదని ధ్వజమెత్తారు. బుధవారం భోలక్‌పూర్‌లో మాదిగ రాజ్యాధికార పోరాట సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 70శాతం ఉన్న మాదిగలకు ఒక్క ఎంపీ సీటు కూడా కేటాయించకపోవడంతో అవమానించినట్లేనన్నారు. మాదిగ రాజ్యాధికార పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.


దొడ్డి కొమురయ్యకు నివాళులర్పిస్తున్న నిజాం కళాశాల ప్రిన్సిపాల్ భీమా తదితరులు

అమరుల ఆశయాల స్ఫూర్తితో ముందుకు సాగాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అమరుల ఆశయాల స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. భీమా పిలుపునిచ్చారు. బుధవారం కళాశాలలో బీసీ సెల్ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ.. అమరుల ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని దేశం, సమాజహితం కోసం పనిచేయాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. ఉపేందర్ రెడ్డి, బీసీ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్. వెంకటేశ్వర్లు, డిప్యూటీ రిజిస్ట్రార్ గీత, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్. రేణుక తదితరులు పాల్గొన్నారు.

'గ్రంథాలయ సిబ్బందికి ట్రెజరీ నుంచి జీతాలు చెల్లించాలి'

చిక్కడపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, పెన్షనర్లకు 010 పద్దుకింద ట్రెజరీ నుంచి వేతనాలు, పెన్షన్లు చెల్లించాలి తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ నూతన అధ్యక్షుడిగా నియమితులైన ప్రముఖ విద్యావేత్త డా. రియాజ్‌ను పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొక్కుల దేవేందర్ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. గ్రంథాలయ సంస్థ పెన్షనర్లకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని, జిల్లా గ్రంథాలయ సంస్థ కమిటీలో సభ్యులుగా పదవీ విరమణ చేసిన గ్రంథాలయ సిబ్బందిని తీసుకోవాలని కోరారు.